# ★ అతని కథ ★

రచన: "నంద శ్రీ"

దూరాన కోడి మేల్కొంది. చీకటి తొలగిపోలేదు. మసగ్గా వెన్నెల కురుస్తోంది. రోడ్డుమీద అక్కడక్కడా రాళ్లలా ఆకాశం లో నక్షత్రాలు చెదురుగా కనిపిస్తున్నాయి చంద్రుడు తెల్లవార్లూ కాంతి కాసి చిక్కి తెల్లబడ్డాడు. ఈదురుగాలి మందంగా వీస్తోంది. ఆ పల్లెటూరు నిశ్శబ్దంగా నిద్ర పోతోంది

కోడి కూతకు చంద్రయ్య మంచంమీద నుంచి లేచాడు. చేత్తో దణ్ణం పెట్టుకొని కళ్లు మూసుకుని మనస్సులో ధ్యానించుకున్నాడు. అరచేతుల్ని చూచుకొని పడుకున్న భార్య మొహంలోకి చూశాడు భార్య నిద్ర పోతోంది. నవ్వుకున్నాడు. పక్కమీదున్న కొడుకుమీద చెయ్యివేసి ఆలోచిస్తూ పడు కున్నాడు. మళ్ళీ భార్య మొహంలోకి చూశాడు. నిర్మలంగా నవ్వుతూ వుంది, నిద్ర లో. ఇంట్లో కిరసనాయిలు బుడ్డి ఆరిపోవ టానికి ఆయాసపడుతోంది. ఎప్పుడో రాత్రి నగా వేసిన ఆ చిన్న బుడ్డిలో, కిరసనాయిలు తెల్లవార్లూ వెలగాలి! చంద్రయ్య అటూ యిటూ పరిగిలి పడుకున్నాడు. భార్య లేస్తే గాని తను లేవడు. యిలా జరగడం తన పెళ్లయిన దగ్గరనుంచి. లేపుదామంటే యిష్టం లేదు. అలాగే పడుకున్నాడు ఊహలతో.

తన భార్య అంజమ్మ చాలా మంచిది. పెళ్లి చేసుకున్న క్రొత్తలో ఎటువంటిదోనని భయపడ్డాడు. కొద్ది రోజుల్లోనే తన్ను ఆమె, ఆమెను తనూ అర్థంచేసుకున్నాడు. అప్పట్లో తనకు పెళ్ళి చేసుకోవడం యిష్టం లేదు. తనకు ఎక్కువరూ లేరు ధర్మపాఠం వరకూ చదువుకున్నాడు. పెద్ద చదువులు చదివి తన వంశంలో గొప్పవాడు కావాలనుకుని కలలు గనేవాడు. ఆ పట్టుదలతోనే రోజూ నాలుగు మైళ్లు వెళ్ళి చదువుకుంటూ వచ్చాడు ఇది తండ్రికి యిష్టం వుండేదికాదు!

'నాయనా చంద్రయ్యా! ఈ చదువులు మనకెందుకు చదువుకోకపోతే బ్రతకలేమా' మన కులవృత్తి మనకుంది అది వున్నంత కాలం మనకేం ఫరవాలేదు నాతోపాటు వుండి పని నేర్చుకో' అనేవాడు తండ్రి

'లేదు నాన్నా నేను చదువుకుంటాను. మనలో చదువుకున్న వాళ్లు ఎవరూ లేరు చదువుకోకపోతే ఎందుకూ పనికిరాము. చదువు వల్ల ఎంత ఉపయోగం వుందో నీకు తెలీదు!' అనేవాడు చంద్రయ్య.

ఆయన నిట్టూర్చి - 'నువ్వు చెప్పేది నిజమే నాయనా. చూస్తూ చూస్తూ కుల వృత్తిని మానుకోలేము అది మహాపాపం తరతరా లుగా పడవల్లో సరుకులు వేసుకెళ్లడం వృత్తి గా వస్తోంది. దాన్ని కాదని మానుకోవద్దు. నేను ముసలవాడ్ని అయిపోయాను...తర్వాత నువ్వు దాన్ని సాగించాల్సిందే. ఇదే నా కోరిక నాయనా. కాదనకు.' తండ్రి కళ్లనీళ్లు కార్చాడు.

చంద్రయ్య ఏమీ చెప్పలేకపోయాడు!

ఒక సంవత్సరం గడిచింది. తండ్రి చచ్చి పోయాడు తండ్రి చనిపోయిన నాటికి తన కెవరూ లేరు తను యీ ప్రపంచంలో ఒం టరి వాడు తండ్రి దహన సంస్కారాలు కూడా గూడెం వాళ్లు చేశారు తన కెన్నో నచ్చచెప్పి ఒక సంవత్సరం పడవలమీద తర్ఫీదు యిచ్చి వూళ్ళు తిప్పారు పడవలు అలా నదిలో వెళుతూ వుంటే తనకు చాలా సంతో షంగా వుండేది ఒడ్డున నున్న చెట్లన్నీ, నీటిలో ఎగిరి పడుతున్న చేపల్నీ చూస్తూ పొంగిపోయేవాడు. మొదట్లో ఇదంతా తనకు క్రొత్తగా వుండి అసహ్యం వేసింది. రాను రాను తండ్రిని తలచుకుని, తన కర్తవ్యం గుర్తుకు తెచ్చుకుని పరిస్థితులకు ఇమిడి పోయాడు. రెండో సంవత్సరం పెళ్ళి చేసుకున్నాడు. ఇప్పుడు తను యిద్దరు బిడ్డల తండ్రి సంసా రం ప్రశాంతంగా గడచిపోతోంది.

భార్య లేచిందేమోనని అటు తిరిగాడు. అంజమ్మ ఎప్పుడో మేల్కొంది. భర్త లేచా డేమోనని చూస్తోంది.

'అంజమ్మా' అన్నాడు చంద్రయ్య.

'ఊ' అంది

'ఎంత సేపయింది లేచి?'

'కాసేపయింది నువ్వు నిద్రపోతున్నావను కున్నాను.'

చంద్రయ్య నవ్వి - 'లేదు. లేచి చాలా సేపయింది.'

'మరి లేపలేదే?'

'నువ్వు లేస్తావని పూరుకున్నాను'

అంజమ్మ లేచి మెళ్లో మంగళ సూత్రాన్ని కళ్ల కద్దుకొని భర్త కాళ్ల దగ్గరకు వచ్చింది. కాళ్ళు ముడుచుకు పడుకున్న చంద్రయ్య, కాలు చాపాడు భార్య చేతులతో కళ్ళు అద్దుకొని భర్త కప్పుకున్న దుప్పటి తొలగిం చింది. చంద్రయ్య అంజమ్మ చేతిని పుచ్చు కుని లేచాడు. కొడుకుని లేపాడు. భార్య కూతుర్ని లేపింది.

అప్పటికి నిశ్శబ్దంగా వున్న గూడెం మేల్కొంది.

చంద్రయ్యకు చద్ది అన్నం మూట కట్టిం తాడు, వల, సంచి పట్టుకుని చంద్రయ్య బయ టకు వచ్చాడు. ఇతన్తో పాటు భార్యా, పిల్లలూ బయటకు వచ్చారు.

'వెళ్లొస్తాను!' అన్నాడు భార్య మొహం లోకి చూస్తూ.

'వెళ్ళి రండి ... తొందరగా వచ్చేయండి.'

(తరువాయి 19 వ పేజీ)

## ★ అ త ని క థ ★

(11 వ పేజీ తరువాయి)

'ఎంత లేదనుకున్నా వారం రోజులు పడుతుంది. అయినా తొందరలోనే వస్తాను' అని పిల్లలను దగ్గరకు తీసుకుని జేబులో చిల్లర డబ్బులు తీసి యిచ్చాడు.

'నాన్నా నాకు మంచి బొమ్మలు తీసుకురావాలి వచ్చేటప్పుడు' అంది మూడేళ్ళ పిల్ల.

'నాన్నా నాకేమో పుస్తకాలు తీసుకురావాలి' అన్నాడు నాలుగేళ్ళ కొడుకు.

'అలాగే నాన్నా, నీకు పుస్తకాలు. చెల్లాయికి బొమ్మలు,' నవ్వాడు

చంద్రయ్య భార్య దగ్గరకు వెళ్లి నీకేం కావాలి?' అన్నాడు.

'ఒక చీర తీసుకురండి. మీరు తొందరగా రండి' అంది సిగ్గుపడుతూ.

చంద్రయ్య నవ్వుకున్నాడు.

'ఏరా చంద్రయ్యా నువ్వు యింకా రాలే!' అంటూ వచ్చాడు స్నేహితుడు.

'వస్తున్నా' అంటూ ముందుకు అడుగులు వేశాడు చంద్రయ్య.

ఇంటినుంచి రేవుకు రెండుఫర్లాంగులదూరం వుంటుంటుంది. దారి పొడుగునా పెద్ద పెద్ద నేరేడు చెట్లు. వివిధ పక్షుల కూతలు ఆహ్లాదకరంగా వుంటాయి. కాలబాటంతా ఇసుక. రేవు దగ్గరకు వచ్చాడు. పదిమంది వున్నారు. ఎనిమిది పడవలు ఒకదాని కొకటి వెనుక వెనుకగా వున్నాయి. పడవల నిండా రవాణా సరుకులు నిండుగా వున్నాయి.

చంద్రయ్య ముందుగా పడవకు దణ్ణం పెట్టి పడవ ఎక్కాడు. మిగిలినవారూ ఎక్కారు. పడవలు వరుసగా బయలు దేరాయి. అప్పటికి సూర్యుడు తూర్పు దిశను తెల్లగా మెరుస్తున్నాడు.

ఏవో మాట్లాడుకుంటూ పదిగంటల వరకూ నడిపారు, ఎండ బాగా వుంది. అందరూ చద్ది అన్నాల మూటలు విప్పారు. చెంబులో వున్న మంచినీళ్లు దగ్గర పెట్టుకున్నారు. నెమ్మదిగా, నిండు చూలాల స్త్రీలాగా పడవలు నడుస్తున్నాయి. ఎండకు నదిలో నీరు తళుక్కున మెరుస్తోంది. గట్ల మీదున్న చెట్ల ప్రతిబింబాలు నీటి నీళ్ళల్లో తలక్రిందులుగా పడి వింతగా వుండి, అలల తాకిడికి చెదరిపోతున్నాయి

అన్నాలు తిన్నారు కంచాలు కడిగి యథాస్థానంలో వుంచారు. చంద్రయ్య పడవ పట్టాకి ఆనుకుని ఆలోచిస్తున్నాడు, చెట్ల మీదున్న పక్షులు కూనిరాగాలు తీస్తున్నాయి. ఎండ తీక్షణంగా వుంది చంద్రయ్యకు చెమట పట్టింది. భుజం గుడ్డతో కందిన ముఖాన్ని తుడుచుకుని సామానికి ఎదురుగా వీపు పెట్టి కూర్చున్నాడు. తదేకంగా ఆకాశం కేసి, చెట్ల కేసి చూస్తున్నాడు. హఠాత్తుగా ఆ దృష్టి చెట్టుకొమ్మ మీదకు మళ్లింది. జంట పక్షులు! చూసి నవ్వుకున్నాడు

తన శోభనం నాటి రాత్రి—

అంజమ్మ మెల్లగా తడబడుతూ, సిగ్గుపడుతూ గదిలోకి వచ్చింది. కూర్చున్న తను మంచం దిగి అంజమ్మ చేతిని మృదువుగా పట్టుకున్నాడు శరీరమంతా జలదరించింది గుండె వేగంగా కొట్టుకుంది. చెమట్లు పోశాయి. ఖంగారుగా – 'అంజమ్మా' అన్నాడు.

అంజమ్మ తలవంచుకుని మంచం దగ్గరకు వచ్చింది. తను ఆమె తల నిమురుతూ ఏమిటేమిటో మాట్లాడేశాడు. మాటల్లో ఆమెను దగ్గరకు తీసుకుని —

'అంజమ్మా, జీవితాంతం యిలాగే గడుపుదాం. ఈరోజు నుంచీ మనం ఒకటి కష్టసుఖాల్నీ సమానంగా పంచుకుందాం.' మరింత దగ్గరకు తీసుకుని అందంగా ముద్దు పెట్టుకున్నాడు.

'అబ్బా! ఏమిటండీ!' అంది బిడియపడుతూ, పులకించిపోతూ.

ఏమిటో ఆ రోజులు వేరు! ఈ రోజులు వేరు!! తనిప్పుడు ఓడ్ల తండ్రి చంద్రయ్య నవ్వుకున్నాడు.

ఎండ కాలుతోంది. సూర్యుడు నడినెత్తి మీదకొచ్చాడు. అంతా వంట ప్రయత్నంలో వున్నారు.

పడవ నీటివాలులో నెమ్మదిగా పోతోంది. మధ్యాహ్నం భోజనాలుకూడా అయిపోయాయి. కొందరు నిద్రపోయారు. ఒకళ్ళిదరుకునికిపాట్లు పడుతున్నారు. చంద్రయ్య పడవ అంచుమీదకువచ్చి కూర్చున్నాడు. నీటిలోకి చూసి, వంగుని చేత్తో నీళ్ళను చిమ్మాడు. అతని మొహంమీద పడ్డాయి నీటి తుంపరలు.

కాలం గడచిపోతోంది. సూర్యుడు క్రుంగిపోతున్నాడు. పలుచగా చుట్టూ చీకట్లు ఆవరించుకుంటున్నాయి యావత్ ప్రపంచం నల్లని ముసుగుకప్పుకున్నట్టు– చెట్లూ, నీళ్ళూ ఆకాశం అంతా చూస్తుండగానే చీకట్లో కలిసిపోయింది. పడవల్లో కిరసనాయిలు బుడ్లు వెలిగించారు. ఉత్సాహంగా వుండడానికి ఏవేవో పాటలు నోటికొచ్చినట్టూ పాడుకుంటున్నారు. కేరింతాలు కొడుతున్నారు. వాళ్ళ జీవితాలూ, వాళ్ళ బ్రతుకులూ, వాళ్ళ భవిష్యత్తు – అంతా ఈ పడవల్లోనే, ఈ నీళ్ళల్లోనే వాళ్ళకు మరో ప్రపంచలేదు! తమ ప్రపంచమే ప్రపంచం. మరేమీ తెలీదు. సరుకున్ని పట్నాలకు తీసుకెళ్ళడం, యివ్వడం, అందుకు పడవకు ఇంత అని ముట్టచెప్పడం. మళ్ళీ ఏవైనా సరుకులువుంటే తీసుకురావడం. తేకుంటే లేదు.

చంద్రయ్య పడవమీద వెల్లికితలా పడుకున్నాడు. తలక్రింద చేతులు పెట్టుకున్నాడు. నల్లని ఆకాశంలోకి, మెరిసే నక్షత్రాలకేసి తదేకంగా చూస్తూన్నాడు.

కాలవ ఒడ్డున ఎత్తైన చెట్లు భయంగొల్పుతున్నాయి. ఎక్కడా సందడిలేదు. కీచురాళ్ళు గోలచేస్తున్నాయి. మిణుగురు పురుగులు చమక్ చమక్‌మంటూ వెలిగి ఆరిపోతున్నాయి. సర్వత్రా తిమిరంలో విలయ తాండవం చేస్తోంది. కాలవ– నల్లని గుడ్డమీద తెల్లని దారం కుట్టినట్టుగా వుంది. కొద్దిగా ఈదురు గాలి వీస్తోంది.

ఈ పాటికి పిల్లలు భోజనాలుచేసి నిద్ర పోతూవుంటారు. అంజమ్మ పక్కమీద పడుకుని ఆలోచిస్తూ వుంటుంది, తన్ను గూర్చి. పిల్లలకు ఈ పడవ ప్రయాణాలు యివేవీ వుండకూడదు. వాళ్ళకు బాగా చదువు చెప్పించాలి పెద్దవాళ్ళయ్యి ఉద్యోగాలు చెయ్యాలి నా బ్రతుకులాంటి బ్రతుకు పిల్లలకు కలగనియ్యకూడదు. పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దాలి. నేనూ ఒకప్పుడూ బాగా చదువుకోవాలని, ఉద్యోగం చెయ్యాలనే కలలుగన్నాను. అవి తీరలేదు జీవితంలో ఎన్నో మలుపులు, సుడిగుండాలూ యివేవీ వారిని చెయ్యకూడదు నాకు చదువులేకపోయినా, నా పిల్లలకు వుండాలి. అదే నేను కోరేది. కొడుకు పెద్దవాడవుతాడు. కూతురు అత్తవారింటికి వెడుతుంది. నన్నూ తల్లినీ పువ్వుల్లో పెట్టి పూజిస్తాడు కొడుకు. ఆలోచనంతో, కలలతో ఎప్పుడో హాయిగా నిద్రపోయాడు చంద్రయ్య.

తెల్లవారింది. పక్షులు గానం చేస్తున్నాయి మంచుపొగ నదిమీద తేలిగ్గా సాగిపోతోంది. చెట్లన్నీ మంచుతో తడిసిపోయాయి. గట్లగడ్డిమీద తుషారబిందువులు తెల్లగా మెరుస్తున్నాయి తూర్పు దిక్కున సూర్యుడు ప్రయాణానికి సంసిద్ధుడౌతున్నాడు. పడవల్లో సరంగులు అంతా లేచారు. ఎవరి పనులు వారు చూసుకోసాగారు. భాస్కరుడు ఆకాశపు మెట్లు ఎక్కుతున్నాడు. ఎండ తీక్షణ తీవ్రంగా వుంది గాలి వీచడంలేదు. ఎక్కడా ఆకులు కదిలినట్టు అలికిడి లేదు. మేము నిరంతర శ్రమతో అలిసిపోయాం. మాకు కొద్ది విశ్రాంతి అవసరం - అన్నట్టు చెట్లు కదలడం లేదు! పడవలు కదలడంలేదు త్రాళ్ళతో లాగవలసిన అవుసరం యేర్పడింది.

చంద్రయ్య పడవత్రాడు పట్టుకుని నీటిలోకి దిగి ఈదుకుంటూ గట్టు ఎక్కాడు. ఆ లావుపాటి త్రాడును రెండు చేతులతో గట్టిగా పట్టుకుని పడవను లాగసాగాడు. పడవ గర్భిణీ స్త్రీలా నడుస్తోంది. కాలం గడచిపోతోంది. చంద్రయ్య అలసిపోయాడు. శరీరమంతా చెమట్లు పట్టి క్రిందకు జారుతున్నాయి. నల్లని అతని శరీరం ఎండకు నిగనిగలాడుతోంది. రెండు నిముషాలు ఆగాడు. నడుంకు కట్టకున్న తుండుగుడ్డ వూడదీసి మొహం తుడుచుకున్నాడు. వెనకాల నుంచి మిగిలిన పడవ వాళ్లు ఏవో పాటలు పాడుకుంటూ త్రాళ్లను లాగుతున్నారు. వెనక్కి తిరిగి చూచి చంద్రయ్య నవ్వుకున్నాడు. ఈ నిరంతర శ్రమలోనే ఎంతో తృప్తి, ఆనందం, అతను వూహించే కలలకు ఈ మాత్రం శ్రమ అవుసరం. శ్రమ, పట్టుదల లేనిదే ఫలితం శూన్యం!

తుండును మళ్లీ నడుంకు కట్టుకున్నాడు. త్రాటిని భుజంమీద వేసుకుని పడవను లాగసాగాడు. అటూ ఇటూ చూచి తనూ పాటలు పాడుకోసాగాడు మైమరచి. ఆకాశం మధ్యనుంచి భానుడు పడమరకు కొద్దిగా వాలాడు. గాలి వేస్తోంది పడవ వేగం హెచ్చింది యిక, త్రాటితో లాగవలసిన అవసరం లేదు. చంద్రయ్య ఈదుకుంటూ వచ్చి పడవ ఎక్కాడు చేతులు మండుతున్నాయి. చూచుకున్నాడు. ఎర్రగా కంది పోయాయి

అతనికి విపరీతంగా ఆకలి వేస్తోంది. కర్తవ్యంలో ఆకలి అనిపించలేదు దాన్ని పూర్తి చెయ్యగానే ఆకలి అనిపించింది. గబగబా యిన్ని నీళ్లలో ఎండుమిరపకాయలూ, బెల్లం కలుపుకుని పులుసుగా చేసుకుని అన్నంలో తిన్నాడు. అదే అతని నిరంతర శ్రమకు క్షుద్బాధను తీర్చే ఆహారం!

◆ ◆ ◆

నాలుగు రోజులకు వారు చేరవలసిన వూరు చేరారు.

లాకులో పడవలు కట్టేరు. తమ వెంట తీసుకు వచ్చిన బట్టలు జాగ్రత్తగా తీసుకుని ఆఫీసులో చూపించారు. పనివాళ్లు పడవల దగ్గరకు వచ్చి సరుకులు క్రిందకు దించారు. అన్నీ సరిపోయాయి, సంతకం చేయించుకుని చంద్రయ్య వాళ్లకు డబ్బు యిచ్చారు. ఆ డబ్బును చేతిలోకి తీసుకుని చంద్రయ్య మురిసిపోయాడు. తను పడ్డ కష్టానికి ప్రతిఫలం! ఈ డబ్బుతో పిల్లలకు బొమ్మలు, పుస్తకాలు, భార్యకు చీర కొనాలి, మరి తనకు ? తనెలా వున్నా ఫరవాలేదు. తన పిల్లలు, భార్య సంతోషిస్తే చాలు.

సాయంత్రం కావస్తోంది. ఆకాశం ఎరుపు, తెలుపు సమ్మేళనంగా వుంది. పశ్చిమ దిక్కున పెద్ద సూర్యబింబం అనంతంలో కలవడానికి ఆసన్నమవుతోంది.

చంద్రయ్య బజారు కెళ్ళాడు. పిల్లలకు బొమ్మల పుస్తకాలు, మట్టిబొమ్మలు, భార్యకు తనకు నచ్చిన రత్నావళి చీరకొన్నాడు. యింకా ఏవో తినుబండారాలు కొన్నాడు.

ఆ రాత్రి పడవలో వాటినన్నిటినీ జాగ్రత్త చేసి నిశ్చింతగా పడుకున్నాడు నిద్ర పట్టడం లేదు. వళ్ళు వేడిగా వుంది. తలనొప్పిగా వుంది శరీరమంతా సూదులు గ్రుచ్చినట్లుగా వుంది. కళ్ళుమూస్తే చాలు- ఆకాశమంతా కూలిపోయి తనమీద పడినట్టుగా వుంది. ఆ స్థితిలో అలాగే ఎన్నెన్నో కలలుగంటూ కలత నిద్రపోయాడు.

తెల్లవారింది. జ్వరం ఎక్కువగా వుంది. ఏమాత్రం తగ్గలేదు. అదే తగ్గుతుందను కున్నాడు. అన్ని పడవలతోనూ తన పడవనూ యింటికి తిప్పాడు. ప్రొద్దుటనుంచీ ఆకాశం శోకదేవతలా వుంది. నల్లని కారు మేఘాలు పరుగుస్తున్నాయి. ఎండ అనేది ఏ మాత్రంలేదు పట్టపగలు, మధ్యాహ్నపూట చీకట్లు అలుముకుంటూ మసక మసగ్గా వుంది, ప్రకృతి. వురుములు వురుముతున్నాయి. ఏ క్షణంలో వర్షం పడుతుందో చెప్పలేకుండా వున్నాం. దానికితోడు ఈదురు గాలి. ఒక్కొక్క గాలితరగం చంద్రయ్యను తాకుతుంటే అతను గజగజ ముసలాడిలా వణకిపోతున్నాడు. చావు బ్రతుకులమధ్య రోగిలా గిలగిల కొట్టుకుంటున్నాడు. అనుకున్నట్టుగానే బోరున వర్షం కురవసాగింది. చంద్రయ్య గుడిసెలోపలకెళ్ళి పడుకున్నాడు. ఆకాశంలో మెరుపులు, ఉరుములు - ఒకదాని కొకటి తీవ్రంగా పోటీపడుతున్నాయి.

సాగిపోతున్న పడవ ఆగిపోయింది. చంద్రయ్య ఆశ్చర్యంతో దిగ్గునలేచాడు! బయట వచ్చి చూశాడు. వర్షపు చినుకులు చంద్రయ్యను తడిపేశాయి. మట్టి దిబ్బతగిలి పడవ ఆగిపోయింది. ముందుకు కదలడానికి వీలులేదు. పడవను మళ్ళిస్తే తప్ప! చంద్రయ్యకు ఏం చెయ్యాలో తోచలేదు ? తను చూస్తే ఈ జ్వరంతో, వళ్ళు నొప్పులతో బాధ పడుతున్నాడు. తక్కిన పడవలన్నీ చా

దూరం ముందుకు వెళ్ళిపోయాయి. యిక్కడే ఆగిపోతే తన గతి? యింటికి ఎంత తొందరగా వెడదామా అని ఆతురితగా వుంది. తన భార్య పిల్లలు తనకోసం ఎదురు చూస్తూ వుంటారు. మొహంమీద పడుతున్న చినుకుల్ని చేత్తో వణకుతూ తుడుచుకున్నాడు. ఆ స్థితిలో అలాగే త్రాడు పట్టుకుని ఒడ్డుకు ఈదుకుంటూ వెళ్ళాడు.

పడవకు కట్టేవున్న త్రాడును చేత్తో గట్టిగా పట్టుకుని నరనరాల్లో వున్న శక్తినంత కూడ గట్టుకొని లాగుతున్నాడు చంద్రయ్య. జోరున వర్షం పడుతూ వింతగా విన్పిస్తోంది. గాలి రివ్వున వీస్తోంది. ఎముకల్ని గజగజలాడించే చలి. అలాగే గడ్డలో, బురదలో పడుతూ లేస్తూ గాగిడి మట్టికి కాళ్ళు జారుతూ వుండగా నిలదొక్కుకుంటూ, అతి ప్రయాసగా, శక్తితో పడవను లాగుతున్నాడు. చంద్రయ్యలో ఓపిక నశించి పోయింది. ముందుకు తూలి పడబోయాడు. ఈ బ్రతుకు నంతా యిలా ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ, చలిలో వణకుతూ గడపవలసిందే! తమ జీవితాలు అటువంటివి. యిక్కడే పుట్టి యిక్కడే పెరిగి యిక్కడే అంతమొందుతారు.

ఉరుములు, వాన తగ్గుముఖం పట్టాయి. గాలి బాగా వీస్తోంది. అతి ప్రయాస మీద పడవ నీళ్ళల్లోకి కదిలింది. చంద్రయ్య ట్యూరా చ్చాడు సంతోషంతో, ఆయాసంతో. లోపలకు వెళ్ళి పడుకున్నాడు నీరసంగా.

యిలాంటి స్థితిలో తన భార్య దగ్గరుంటే? ఆమె వళ్లో తలపెట్టి ఈ బాధ లన్నిటినీ మరచి పోయి నిశ్చింతగా కళ్లు మూసుకుని పడుకుంటాడు. అక్కడే తన భార్య, పిల్లలు - ఈ స్థితిలో ఏం చేస్తున్నారో? పిల్లలు జడుసుకున్నారేమో, ఛీ! ఛీ! ఏం బ్రతుకులు! అక్కడికే తను అనుకున్న రోజుకంటే ఒక రోజు ముందుగానే యింటికి వెడుతున్నాడు.

◆ ◆ ◆

చీకట్లు మెల్లగా వెల్తుర్ని మింగేస్తున్నాయి. ఆకాశంలో మేఘాలు కదలకుండా పడుకుని వున్నాయి. నదిలో నీళ్ళు నిద్రపోతున్నాయి. పక్షుల కిలకిలలు ఆగిపోయాయి. అప్పుడే చెట్టు మీద నుంచి ఏదో పక్షి అరచింది. సర్వత్రా నిశ్శబ్దంగా వుంది.

పడవలు రేవులో ఆగాయి. ఎవరి సామానులు వారు తీసుకుని వెడుతున్నారు. చంద్రయ్య భుజాన మూట వేసుకుని ఉత్సాహంతో నడుస్తున్నాడు. తన కోసం భార్య యింటి ముందు కూర్చుని ఎదురు చూస్తూ వుంటుంది. తన్ను చూచి ఆశ్చర్యపోతుంది. సంతోషంతో, సిగ్గుతో తలవంచుకుని సామాను అందుకుని లోపలకు నడుస్తుంది. భార్య వెంట తనూ లోపలకు వెడతాడు.

ఆలోచనలతో చంద్రయ్య ఇంటి ముందు ఆగాడు. తలుపులు వేసివున్నాయి. బయట దీపంకూడా లేదు. తనకొచ్చిన ఊహాలకు నవ్వుకున్నాడు! అవును తన భార్య తనకోసం ఎందుకు ఎదురు చూస్తూవుంటుంది? తను వస్తున్నాడని తెలిగు. లోపలకూడా దీపం వున్నట్టు లేదు. యిల్లంతా బోసిగా, నిశ్శబ్దంగా వుంది.

భుజాన వున్న సామాను అరుగు మీద పెట్టాడు. కాళ్ళు చేతులు కడుక్కుందామని పక్కనున్న నూతిదగ్గరకు వెళ్లాడు. అక్కడ పాత్రలు, చెంబు దట్టంగా వున్నాయి. చంద్రయ్య అటూ యిటూ చూశాడు. అంతలో అతనికి మాటలు వినిపించాయి. మాట్లాడేది తన భార్య. రెండోవాడు ఎవరు? గబగబా చెట్లచాటు కెళ్ళి అవతలకు తొంగి చూశాడు. ఆశ్చర్యపోయాడు. కోపంతో, అసహ్యంతో తన్ను తాను మరచిపోయాడు. భార్య, మరొకడు ఎవడో? వాడి వక్షంమీద తల అనించి మాట్లాడుతోంది. వెంటనే వాళ్ళిద్దర్నీ చంపుదామనుకున్నాడు. పళ్ళు కొరికాడు. అతనిలో రక్తం నరనరాన కోపంతో పాకుతోంది. ఒక అడుగు ముందుకు వేశాడు. కాని, రెండో అడుగు ముందుకు వెయ్యలేకపోయాడు. ఆ అడుగు కూడా ముందుకు వేస్తే ఏం జరుగుతుందో తనకు తెలుసు! అలా జరిగితే తను చాలా మూర్ఖంగా, వివేకహీనుడుగా ప్రవర్తించిన వాడవుతాడు! మానవత్వానికి అర్థం వుండదు!! ఏదో అవ్యక్తమైన శక్తి వెయ్యి కిరణాలతో అరుస్తూ అతడ్ని వెనక్కి లాగేసింది. వెనక్కి తిరిగాడు. పాదాలకింద ఎండుటాకులు గలగలమన్నాయి. అక్కడున్న జంట వులిక్కిపడింది.

చంద్రయ్య తన్ను తాను నిభాయించుకుని యింటి ముందుకొచ్చి అంజమ్మను పిలిచాడు. పది నిముషాలకు తలుపులు తెరుచుకున్నాయి.

'నువ్వా! ఎప్పుడొచ్చావు? అనుకోకుండా వచ్చేశావు?' అంది ఆశ్చర్యంతో, తొట్రుపాటుతో.

చంద్రయ్య సామానుతో మాట్లాడకుండా లోపలకు వెళ్లాడు.

'అన్నం వడ్డిస్తాను'

'అక్కర్లేదు ఆకలిగా లేదు' అన్నాడు. ఎంత నిగ్రహంగా మాట్లాడుదామనుకున్నా లాభం లేకపోయింది. కర్కశంగా వుంది స్వరం.

'అదేమిటి?'

'వాడికీ నీకు ఎంత కాలంనుంచి సంబంధం?'

'ఏమి మాట్లాడుతోంది?' అంది తడబడుతూ.

'నాకంతా తెలుసు. ఇప్పుడే దగ్గరో అంతా చూశాను. ఛా! ఇప్పుడు ఆడదానివేనా? నా భార్యవని మరచిపోయావు. ఇద్దరు బిడ్డల తల్లివి. నీకేం అన్యాయం చేశానని యిలా పాల్పడ్డావు. యింత కాలం నుంచి నామీద చూపించింది నటన. నేను మోసపోయా... అవునా? ఏం మాట్లాడవు?'

అంజమ్మ వణకిపోతోంది. ఈ నాటకం తనకూ, చంద్రయ్యకీ వున్న బాంధవ్యం అంతా ఒక్క క్షణం ఆసన్నమయింది. మాట్లాడకుండా నిలబడిపోయింది.

'ఈ విషయం రేపు అందరికీ తెలిస్తే మనం తలయెత్తుకుని తిరగ్గలమా? ఫలానా వాడి భార్య ఫలానా అని అందరూ అనుకుంటుంటే ఆ మాటలు భరించగలవా? ఎందుకంత నీకు ఆకలిగా వుంది? చూడు నీకోసం, పిల్లల కోసం ఏం తీసుకువచ్చానో' అంటూ మూట విప్పాడు. అందులో చీర, బొమ్మలు.

అంజమ్మ వాటికేసి క్రీగంట చూసి మాట్లాడకుండా వూరుకుంది!

'ఈ విషయంలో నాదే తప్పు. విన్నవి ప్రయోజనం లేదు. యికనుంచయినా జాగ్రత్తగా మసులుకో.'

చంద్రయ్య బయటకు నడిచాడు. అంతకంటే మరేమీ చెయ్యలేదు. తనలో శక్తినంతా ఎవరో పిండేసినట్టు నిస్పృహతో గోడకు ఆనుకునిపోయాడు. భార్య తనమీద చూపి...

దంతా కృత్రిమ నటనేనా? తనామెను ఎంత ప్రేమగా చూడలేదు. ఏ లోటూ లేకుండా ఎప్పుడూ మనస్సు నొప్పించకుండా ప్రవర్తిస్తూ వచ్చాడు. తనలాంటిభార్య మరెవరికీ రాకుండా వుండాలని కోరుకున్నాడు! కాని, జరిగిందేమిటి? తన భార్య ...! తన్ను అర్థంచేసుకోలేకపోయింది. ఈ నటనమైన ప్రేమ వెనుక ఎంతటి జుగుప్సాకరమైన సంఘటనదాగివుంది! అదే తను చూడకుండావుంటే ఏం జరిగేది? కాలం యిలాగే మోసాలతో జరిగిపోయేది!! భార్యను గాఢంగా ప్రేమిస్తూ వుండేవాడు. ఒక్క నీచమైన సంఘటనతో, తన భార్య మీదున్న అనురాగం అంతరించిపోయింది. ఒక వ్యక్తి యొక్క, అందులోనూ తన బ్రతుక్కి ఆలంబనమైన వ్యక్తియొక్క నిజ స్వరూపం కళ్ళబడగానే కదలిపోయాడు తన భార్యను ఏలుకోవలసిందే. లేకుంటే అందరికీ ఈ విషయం తెలుస్తుంది, అసహ్యించుకుంటారు. అలా అవమానం పొందడం కంటే తను చూచిన పాపపు సంఘటన తన హృదయములోనే వుండిపోవాలి.

ఈ లోకంలో 'ఒకరకమైన మనుష్యులున్నారు. వారు తెలిసో తెలియకో తప్పులు చెయ్యడం సహజం. తాము చేసేది తప్పని తెలుసు. అయినా చేస్తారు. ఒకరకమైన నిస్సహాయభావం ఏర్పడుతుంది వారిలో. మనం చేసేది ఏమిటి? దాని ఫలితం ఎలా వుంటుంది? అని ఆలోచిస్తే ఏమీ చెయ్యలేరు. అంజమ్మ ఏదో ఉద్రేకంలో అలా చేసింది. రేపటినుంచి మామూలుగా వుంటుంది తను కూడా ఆమె మీద కోపగించుకుంటే అంజమ్మకు దిక్కెవరు? అయితే, తను భార్యను యిదివరకటిలా ప్రేమించగలడా? కష్టం, అయినా ప్రయత్నించాలి. యితరులకు ఏమాత్రం అనుమానం కలగనీయకూడదు. తలచుకుంటుంటే చంద్రయ్య వణికిపోతున్నాడు మనస్సంతా వికలమైపోయింది.

◆ ◆ ◆

తెల్లవారుతోంది. ప్రకృతి బద్ధకంగా మేల్కొంటోంది. కాకులు అరుస్తున్నాయి. పక్కమీదనుంచి లేచిన పిల్లలు — అమ్మా' అంటూ బిగ్గరగా ఏడుస్తున్నారు. బయటి గోడకు ఆనుకుని పడుకున్న చంద్రయ్యకు పీడకల వచ్చినట్టు దిగ్గున లేచాడు. పిల్లలు ఇంట్లో ఏడుస్తున్నారు. చంద్రయ్య గబగబా లోపలికి వెళ్ళాడు. రాత్రి తను తెచ్చిన వస్తువులన్నీ చెందర చెందరగా పడివున్నాయి. పిల్లలకోసం తెచ్చిన బొమ్మలు ముక్కలుగా విరిగి నేలమీద పడి చెల్లాచెదరుగా వున్నాయి. జరిగింది చంద్రయ్యకు అర్థమయింది! యిల్లంతా కలయచూశాడు. అంజమ్మ ఎక్కడా కనుపించలేదు.

ఆమె చావలేదు. కాని లేచి వెళ్ళిపోయింది.

'అంజమ్మా' అంటూ గద్గదకంఠంగా వణకుతూ గొణుక్కున్నాడు, చంద్రయ్య. అతని కళ్ళు అప్రయత్నంగా చెమర్చాయి. కళ్ళు తుడుచుకుంటూ ఏడ్చేపిల్లల్ని దగ్గరకుతీసుకున్నాడు.

## మావో కంటున్న ప్రపంచ స్వరూపం

(10 వ పేజీ తరువాయి)

విధాల మళ్ళింపజేయాలని చూస్తున్నది.

ఈ రెండు వ్యవహారాలలోనూ యుద్ధాలవల్ల వీరు (చైనా) సాధించగల్గేది చాలా స్వల్పం. ఇంతకు ముందుకూడా చైనా ఎక్కడ కాలు పెట్టినా ఇలాగే జరిగింది.

కమ్యూనిస్టు చైనా ప్రమాదాన్ని అతిశయంగా చేసుకోటానికి అవకాశం ఉన్నది తగ్గించి చెప్పటానికి ఆస్కారం ఉంది. అయితే ప్రస్తుతం అమెరికాలో ఈ ప్రమాదం గురించి అధికంగా చెప్పటోవటం జరుగుచున్నది. ఆగ్నేయాసియలో పెకింగు పెద్ద విజయాలే సాధించింది. అయితే అది వేసుకొన్న అంచనాల ప్రకార ఫలితాలు సైతం అనుకొంటున్నదానికి విరుగుడుగాకూడా ఈ సిద్ధాంతపత్రాన్ని కమ్యూనిస్టు చైనా నాయకులు రూపొందించి ఉంటారు.

"మన విప్లవం విజయంపొంది, మన జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమం పురోగమిస్తూ, ప్రజారోగ్యం మెరుగై, జీవన ప్రమాణాలు పెరిగిన ఫలితంగా మనలోకూడా విప్లవతత్వం మార్క్సిజం-లెనినిజం, కార్మికవర్గ అంతర్జాతీయ వాదం మందగించిపోయాయని ఎవరైనా అనుకుంటే వాళ్లు పగటికలలు కంటున్నారు" అని లిన్ వ్రాశాడు.

### మావో వృద్ధాప్యం

అయినప్పటికీ మావో పలువురు విదేశీ అతిథులతో పలు సందర్భాలలో యువతరం చైనీయులలో తమ పెద్దలనాటివిప్లవతత్వం లోపిస్తున్నట్లు కనపడుతున్నదని చెప్పిన మాట ఇక్కడ గుర్తు చేసుకోవాలి. ఈ పెద్దలనే వాళ్లు మావో నాయకత్వాన చైనాను జయించేముందు దీర్ఘకాలం యెనాన్ గుహాలలో అజ్ఞాతవాసం చేస్తూ గడిపిన వాళ్ళు.

కనుక ఈ లిన్ వ్యాసం ఇతని పేరుతో వెలువడినప్పటికీ ఇది మావో వీలునామా వంటిది కావచ్చునని కొందరు భావిస్తున్నారు. దీనిని మావో స్వయంగా వ్రాసి ఉంటాడని వీరి నమ్మకం

లిన్ వ్యాస ప్రకటనకు పెకింగు కారణాలు ఏవైనా కావచ్చు. చైనా నాయకుడు ఈ పత్రాన్ని అతి ముఖ్యమైనదిగా పరిగణిస్తున్నారనటంలో సందేహంలేదు. దీనిని ఏకకాలంలో అయిదు చైనా భాషలలో ప్రచురించారు. రేడియోలో పూర్తి పాఠం ప్రసారం చేశారు.

ఇది అమెరికామీద, దాని ఆశ్రయాలమీద చైనా దీర్ఘకాల పోరాట ప్రకటన అన్నది సత్యం. చైనాకు, ప్రస్తుత సోవియట్ నాయకులకు మధ్య దీనివల్ల వైరుధ్యం, పెరిగే అవకాశం ఉంటే, పెరుగుతుంది తస్మాత్ జాగ్రత!

—('వాషింగ్టన్ పోస్టు' సౌజన్యంతో)

కాపీరైటు: 1965 వాషింగ్టన్ పోస్ట్ కంపెనీ